## క్లుప్తంగా

### దుబ్బాక ఆత్మగౌరవం సిద్దిపేటకు తాకట్టు పెట్టొద్దు



కాంగ్రెస్‌లో చేరిన గ్రామస్తులు

చేగుంట(తూప్రాన్): బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తే దుబ్బాక ఆత్మగౌరవం సిద్దిపేటకు తాకట్టు పెట్టినట్టే అని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోనాల్, కిష్టాపూర్ గ్రామాల్లో పలు పార్టీల నాయకులు పార్టీపై అభిమానంతో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే సిద్దిపేటకు వెళ్లి అభివృద్ధి పనులు అడుక్కోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్, అంజి, ఆగమయ్య, శ్రీనివాస్‌తో పాటు పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### 4న చలో ఢిల్లీ

నర్సాపూర్: డిసెంబరు 4న ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత ప్రజా సంఘాల నాయకులు నాగరాజు, ఆనంద్, నరేశ్, యాదగిరి, శ్రీకాంత్, చందు, అనిల్‌లు కోరారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు 16 డిమాండ్ల సాధన కోసం దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ కోటి సంతకాల సేకరణ చేసి రాష్ట్రపతికి ఇవ్వాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో దళితులు, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

### విద్యార్థులను పట్టించుకునే వారేరి ?



పాఠశాల మూడో అంతస్తు పిట్టగోడపై కూర్చున్న విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులను పట్టించుకునే వారు కరువయ్యారు. ఆశ్రమ పాఠశాల సంక్షేమ అధికారి అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో విద్యార్థులు ఆశ్రమ పాఠశాల మూడో అంతస్తులపై ఎక్కి పిట్టగోడపై కుర్చొని కాలక్షేపం చేశారు. దీంతో ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యులని చూసిన గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### యుద్ధభేరికి తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు



యుద్ధభేరికి వెళ్తున్న నాయకులు

కొల్చారం(నర్సాపూర్): సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయమైన వాటా కోసం ఆదివారం హైదరాబాదులోని ఇందిరా పార్క్‌లో నిర్వహించే మాదిగల యుద్ధభేరికి మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు తరలి వెళ్లారు. అంతకుముందు ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు మాదిగ డిక్లరేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో అన్ని రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గాల బిల్లును అమలు చేసేలా బీజేపీపై ఒత్తిడి తేవాలన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం నుంచి పలువురు నాయకులు యుద్ధభేరి కార్యక్రమానికి తరలి వెళ్లారు. యుద్ధభేరికి తరలిన వారిలో ఎమ్మార్పీస్ జాతీయ నాయకుడు యాదగిరి, దుర్గేశ్, సిద్ధిరాములు, రాములు, బాబు, స్వామి, చందూ తదితరులు ఉన్నారు.

### ఎంపీ త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు

దుబ్బాక: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని పట్టణంలో బిస్మిల్లా బైతుల్ మాల్ ట్రస్ట్ చైర్మన్ చాంద్‌మియా ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలు, బీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# కేసీఆర్ పాలనలోనే సంక్షేమం

- రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



మనోహరాబాద్(తూప్రాన్): మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): కేసీఆర్ పాలనలోనే సంక్షేమం ఉంటుందని రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండల కేంద్రం, రంగాయపల్లి, కోనాయపల్లి(పీటీ), ధర్మరాజ్‌పల్లి, దండుపల్లి, కాళ్ళకల్ గ్రామాల్లో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు ఎలక్షన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ర్యాకల శేఖర్‌గౌడ్, మండలాధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్‌లు నాగభూషణం, ప్రభావతి, నర్సయ్య, నాయకులు వెంకట్‌గౌడ్, పురం రవి, చంద్రశేఖర్, ఉప సర్పంచ్‌లు నవీన్‌చారి, ధర్మేందర్, తుమ్మల రాజు, కరుణాకర్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, ఇర్ఫాన్, జావీద్, వెంకటేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ పార్టీదే అధికారం

పెద్దశంకరంపేట(మెదక్): మరోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బద్దారం, గొట్టిముక్కుల, మల్కాపూర్ తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలందరూ కారు గుర్తుకే ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, ఎంపీటీసీలు దత్తు, వీణసుభాశ్‌గౌడ్, నాయకులు వంశీ, సూర్యప్రకాశ్, విఠల్‌గౌడ్, నారాయణ, పున్నయ్య, తుకారం, గంగారం, సంగయ్య

### బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

చేగుంట(తూప్రాన్): మండలంలోని అనంతసాగర్‌తో పాటు రుక్మాపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అభ్యర్థిపై ప్రభాకర్‌రెడ్డిపై దాడి జరిగినందున ఇంటింటి ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్న సీఎం కేసీఆర్‌ను చూసి బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ హోలియా, సొసైటీ చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ తానీషా, నదీమ్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



గొట్టిముక్కులలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అలాగే మనోహరాబాద్ మండలంలోని వెంకటాపూర్ అగ్రహారానికి చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఎలక్షన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గల్లీకో బెల్ట్‌షాప్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



వల్భాపూర్‌లో ఓటు వేయాలని మహిళలను అభ్యర్థిస్తున్న శ్రీనివాసరెడ్డి

- దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాసరెడ్డి

రామాయంపేట(మెదక్): బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గల్లీకో బెల్ట్‌షాప్ ఉందని దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఆదివారం నార్సింగి మండల కేంద్రం, నర్సంపల్లి, పెద్ద తండా, వల్లూర్, వల్భాపూర్, బీంరావుపల్లి, గ్రామాల్లో ఆయన ప్రచార సభల్లో మాట్లాడారు. దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి ప్రజల సమస్యలు పట్టవని అన్నారు. దోపిడి చేసిన సంపదను బీఆర్‌ఎస్ ఎన్నికల్లో అడ్డగోలుగా ఖర్చు పెడుతుందని, వారు ఇచ్చిన డబ్బులు తీసుకొని, ఓటు మాత్రం ధర్మానికే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా నాయకుడు యాదగిరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని ఒక్క గ్రామం తప్పించి ఏ గ్రామంలో కూడా దళితబంధు రాలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. గతంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేరలేదని, ఈ విషయం ప్రజలందరికీ తెలుసునని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగులు, జిల్లా కన్వీనర్ విప్లవ్‌కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి బైరాం కుమార్, కోనాపూర్ సహకార సంఘం డైరెక్టర్ మామిడి సిద్దరాంలు, జిల్లా నాయకులు శ్రీధర్‌రెడ్డి, దోమకొండ యాదగిరి, సాగర్, జిల్లా మైనార్టీ సెల్ నాయకుడు జహీర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు సత్యం, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

### సీఎం సభకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

నర్సాపూర్: సీఎం కేసీఆర్ పాల్గొనే సభ ఏర్పాటు చేసేందుకు బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 16న సీఎం కేసీఆర్ నర్సాపూర్ రానున్నారని నర్సాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చెప్పారు. సీఎం వస్తున్నందున బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని వారు పరిశీలించారు. వారి వెంట కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

### నగదు పట్టివేత



నగదు తీసుకున్నట్లు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎస్‌ఐ

మనోహరాబాద్(తూప్రాన్): ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీలో పేట్ బషీర్‌బాద్‌కు చెందిన భూపారం తబ్బార్ వద్ద నుంచి రూ 89 వేల నగదును ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును పీఎస్ గజ్వేల్‌లో రిపోర్టు చేసినట్లు, అవసరమైన పత్రాలను చూపించి డబ్బు తీసుకోవచ్చని ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ శివారులో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 40) మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి వాహనం ఢీ కొని వెళ్లిపోయినట్లు తెలిపారు.

### నిరుపేద కుటుంబానికి 'ఆపన్నహస్తం'

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ నిరుపేద కుటుంబానికి 'ఆపన్నహస్త మిత్రబృందం' చేయూతనందించింది. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు చెందిన సాయిసుష్మిత గుండె సంబంధిత వ్యాధితో, ఆమె సోదరుడు బోన్ మ్యారో వ్యాధితో బాధపడుతున్నారు. వీరి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. తల్లి ఇందిర చిరు వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. విషయం తెలుసుకున్న ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు ఆదివారం వారికి రూ. 20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆపన్నహస్త మిత్రబృందం అధ్యక్షుడు బాల్‌చంద్రం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

### కరపత్రాల ఆవిష్కరణ

గజ్వేల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎంఈఎఫ్ మండల అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈనెల 11న సికింద్రాబాద్‌లో తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల ముత్యాలమ్మ, నల్లపోచమ్మ దేవాలయం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు.

# సమ్మేళనానికి తరలిన బీఆర్‌ఎస్ నాయకులు



శివ్వంపేట(నర్సాపూర్): సమ్మేళనానికి తరలుతున్న నాయకులు



కౌడిపల్లి నుంచి గిరిజన సమ్మేళనానికి వెళ్తున్న గిరిజనులు

కౌడిపల్లి(నర్సాపూర్): నర్సాపూర్‌లో ఆదివారం నిర్వహించిన గిరిజన సమ్మేళనానికి మండలంలోని వివిధ తండాలకు చెందిన గిరిజనులు భారీగా తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో ఎంపీపీ రాజు నాయక్, జెడ్పీటీసీ కవిత అమర్ సింగ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రామగౌడ్, వివిధ తండాల ప్రజాప్రతినిధులు, తండావాసులు ఉన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): నర్సాపూర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన ఎస్టీ సమ్మేళనానికి మండలం నుంచి బంజారా శ్రేణులు తరలివెళ్లారు.కార్యక్రమంలో మండలంలోని వివిధ తండాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.



బోనాలు ఊరేగిస్తున్న భక్తులు

### దుర్గమ్మ జాతర ప్రారంభం

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట గ్రామంలో దుర్గమ్మ జాతర ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలో చండీ హోమం, గ్రామ దేవతలు పోచమ్మ, ముత్యాలమ్మ, మత్తడి పోచమ్మలకు భక్తులు బోనాలు ఊరేగించి పూజలు చేశారు. కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యులు దుర్గమ్మకు వెండి గొలుసును సమర్పించారు.

# కాంగ్రెస్‌లో చేరికలు

నర్సాపూర్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ మెగావత్ హంసీ బాబాయి ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ నాయకురాలు చిలుముల సుహాసినిరెడ్డి, చిలిప్‌చెడ్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చిలుముల శేషాసాయిరెడ్డిల ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారధ్యాయన ఆమెకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు సుదీర్‌రెడ్డి, కృష్ణగౌడ్ ఉన్నారు.

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మాజీ వైస్ ఎంపీపీ రుక్మారెడ్డి శనివారం రాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మైనంపల్లి రోహిత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన హంసీబాయి

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- ఎన్నికల ప్రచారంలో త్రిష దామోదర్



మాట్లాడుతున్న త్రిష

రేగోడ్(మెదక్): పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని త్రిష దామోదర్ అన్నారు. మండలంలోని మర్పల్లి గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందోల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, తన తండ్రి దామోదర్ రాజనర్సింహను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతీ హామీని నెరవేరుస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. అదే విధంగా రేగోడ్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఆరు గ్యారంటీ హామీలను వివరించారు. కార్యక్రమంలో రేగోడ్ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప, పార్టీ మండల ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, మాజీ సర్పంచ్ విజయ భాస్కర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాధాకిషన్, మాజీ చైర్మన్ శ్యాంరావ్ కులకర్ణి, ఉప సర్పంచ్ రాములు, నాయకులు శివకుమార్, భాస్కర్, అంజిరెడ్డి, తుల్జారాంగౌడ్, మోహన్, లింగం తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మర్పల్లి ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఈయనతో పాటు మరో 15మంది బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌పాటిల్, గ్రామ అధ్యక్షుడు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

టేక్మాల్(మెదక్): కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం టేక్మాల్‌లో కాంగ్రెస్ పార్టీ అందోల్ అభ్యర్థి దామోదర రాజనర్సింహకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింట ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ముందుకు వెళ్తుందని తెలిపారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో అందోల్ ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇందులో మండల కోఆప్షన్ సభ్యులు మజహర్, నాయకులు మాన్ కిషన్, పాపయ్య, సుధాకర్, అనిల్, శివమల్లయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, కమర్, కిషన్ తదితరులు ఉన్నారు.

# ఆలయాల్లో భక్తుల సందడి



కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చాముండేశ్వరీ ఆలయంలో అర్చకులు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇచ్చారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మ దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఆలయ అర్చకుడు శివప్ప, రాజేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఒడిబియ్యం సమర్పించడంతోపాటు బోనాలు తీసి ప్రత్యేక పూజలు చేశారు.

# అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోండి

రామాయంపేట(మెదక్): నూతనంగా ఏర్పడిన రామాయంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీకి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హూస్సేన్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కళాశాలలో తెలుగు, జూవాలజీ, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఇంగ్లీశ్, ఎకనామిక్స్, కామర్స్, కెమిస్ట్రీ, బోటనీ సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపకుల పోస్టుల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టుల్లో నెట్, సెట్, పీహెచ్‌డీ డిగ్రీలు ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుదారుల్లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు, పీజీలో 50 శాతం, బీసీ అభ్యర్థులు 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గలవారు ఈనెల ఎనిమిదిన సాయంత్రం ఐదు లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# పోలీసు బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం చిన్నశంకరంపేటతో పాటు గవ్వలపల్లి చౌరస్తాలో పోలీసు బలగాలు కవాతు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తుతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు ప్రజలకు భరోసా కల్పించేందుకు పోలీసు కవాతు నిర్వహించినట్లు రామాయంపేట సీఐ లక్ష్మీబాబు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి సంఘ విద్రోహ చర్యలకు పాల్పడినా.. ఎన్నికల నిర్వహణకు ఎలాంటి విఘాతం కల్పించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐ నారాయణ ఉన్నారు.

# రఘునందన్‌రావు గెలుపు ఖాయం



ఎల్కల్‌లో బీజేపీ నాయకుల ప్రచారం

మిరుదొడ్డి(దుబ్బాక)/రాయపోలు: దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు ఖాయమని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి సుధారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలపరిధిలోని మల్లుపల్లి, లింగుపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలకు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నారాయణరెడ్డి, శేఖర్‌రెడ్డి, రమేష్, నవీన్, శంకర్, బాలకృష్ణ, భిక్షపతి, నాగరాజు, రంగారెడ్డి, పర్శరాములు, రాము, అజయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాయపోలు మండలం ఎల్కల్‌లో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మాదాసు వెంకట్‌గౌడ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు మంకిడి స్వామి, రాష్ట్ర నాయకుడు బాగన్నగారి రవీందర్‌రెడ్డి తదితరులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాయపోలు వైఎస్ ఎంపీపీ రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు, నాయకులు వెంకటేశ్‌గౌడ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని రాజీవ్ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రజ్ఞాపూర్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు మండల పరిధిలోని రిమ్మనగూడ సమీపంలో రోడ్డు దాటేందుకు నడుచుకుంటూ వెళ్తున్న పాదాచారుడిని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అవతలివైపు పడ్డాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు రామాయంపేటకు చెందిన బల్ల ప్రత్యూష్ (24)గా గుర్తించినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రేగోడ్(మెదక్): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని పట్టుకున్న సంఘటన మండలంలోని పోచారం గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. వెంటనే తన సిబ్బందితో ఆ స్థావరంపై దాడి చేయగా.. పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని, వారి వద్ద ఉన్న రూ.17వేల 860ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని వివరించారు.